
సాక్షి ఒడిశా

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,77,946లు. బంగారం 13 గ్రాము 170 మిల్లీగ్రాములు, వెండి 26 గ్రాములు 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆహార భద్రతలో.. తృణ ధాన్యాల పాత్ర కీలకం

రానున్న రోజుల్లో ఆహార భద్రతలో తృణ ధాన్యాల పాత్ర కీలకమని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు.

- 2లో.



రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు

రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యమని రాజ్యసభ ఎంపీ, బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సురేష్ పూజారి అన్నారు.

- 2లో.

న్యూస్‌రీల్

రాయగడ మిల్లెట్స్ మిషన్‌కు అవార్డు

రాయగడ: ఒడిశా మిల్లెట్స్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అన్నివిధాల ప్రోత్సహించి ఉత్తమ పనితీరును కనబరిచినందుకు రాష్ట్ర ప్రభుత్వం రాయగడ మిల్లెట్స్ మిషన్ సంస్థకు ఉత్తమ అవార్డును ప్రకటించింది. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మిల్లెట్స్ మిషన్ సదస్సులో ఈ మేరకు సీఎం నవీన్ పట్నాయక్ చేతులమీదుగా రాయగడ ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టర్ స్వాదాదేవ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.

భారీగా గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో 225 కేజీల గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బలిమెల సమితి సుర్లుకొండ, పాత చిమ్మటపల్లి గ్రామాల మధ్య అడవిలో నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు బలిమెల ఐఐసీ సుమన్ పట్నాయిక్‌కు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో ఆయన తన సిబ్బందితో ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో అడవికి సమీపంలో ఇద్దరు వ్యక్తులు 7 బస్తాల గంజాయితో వాహనం కోసం ఎదురు చూస్తున్నారు. పోలీసులు వెళ్లి ఆ ఇద్దరినీ ప్రశ్నించి వారి వద్దనున్న బస్తాలను తనిఖీ చేయగా, అందులో గంజాయిని గుర్తించి వెంటనే ఇద్దరినీ అరెస్టు చేశారు. అనంతరం వారిని బలిమెల పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం ఈ ఇద్దరు నవరంగ్‌పూర్ జిల్లాకు చెందిన మాసిక్ గండ్(35), చైతన్య హరిజాన్ (55)గా నిర్ధారించారు. ఆంధ్రాకు గంజాయిని తరలించేందుకు మల్కన్‌గిరి జిల్లాలో కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరిచారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

సంకీర్తన సత్యాగ్రహం

- శ్రీమందిరం 4 ద్వారాలు తెరవాలని కాంగ్రెస్ డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా సంకీర్తనలతో నిరసన
- ఇప్పట్లో తెరవలేం: జిల్లా యంత్రాంగం



సంకీర్తన సత్యాగ్రహంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్ తదితరులు

భువనేశ్వర్: పూరీలోని శ్రీమందిరం 4 ద్వారాలు తెరవాలని, రత్న భాండాగారంలో భద్రపరచిన స్వామివారి నగలు, ఆభరణాలు ఇతరేతర వస్తువులను బహిరంగపరచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు గురువారం శాంతియుతంగా ఆందోళన చేపట్టారు. ఆందోళనలో భాగంగా స్థానిక కాంగ్రెస్ భవన్ ఆవరణలో బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుడు, సుదర్శనుని ప్రతిమలు ఏర్పాటు చేసి, పూజాదులు చేపట్టి సంకీర్తన సత్యాగ్రహం చేపట్టారు. ఈ నిరసనలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తదితర పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిమాండ్ల సాధన కోసం కాంగ్రెస్ నేతలు తాళాలు, మృదంగం వాయిస్తూ నిరసన ప్రదర్శించారు. అలాగే పూరీలోని శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో పూరీ జిల్లా శాఖ కాంగ్రెస్ కార్యకర్తలు సంకీర్తన సత్యాగ్రహం ఆందోళన నిర్వహించారు. శతాబ్దాల నాటి ప్రాచీన శ్రీమందిరం నలువైపుల ఉన్న 4 ద్వారాలు తెరవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. భక్తులు, యాత్రికుల రాకపోకలు కేవలం సింహద్వారం గుండా నిర్వహించడంతో రద్దీ నివారణ చేయి దాటిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా స్థానిక పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

లెక్కలు చెప్పాలని డిమాండ్

శ్రీమందిరంలోని రత్న భాండాగారం తెరిచి భద్రపరచిన అమూల్యమైన రత్నాలు మరియు ఆభరణాల జాబితాను సిద్ధంచేసి సార్వజనీనం చేయాలని డిమాండ్ చేశారు. రత్న భాండాగారం తాళాలు కనిపించలేదని రాష్ట్ర ప్రభుత్వం నాటకీయ వైఖరితో అవసరమైన మరమ్మతు పనులు చేపట్టడం, సొత్తు లెక్కించడం ప్రక్రియ దీర్ఘకాలంగా వాయిదా పడింది. ఈ వైఖరితో ఖజానాలో స్వామి సొత్తు భద్రతపై సర్వత్రా పలు అనుమానాలు బలపడుతున్నాయి. తక్షణమే రత్న భాండాగారం తెరిచి లోపలి స్థితిగతుల సమీక్షతో ఆభరణాల గణాంకం వగైరా వివరాలను బహిరంగపరచాలని కోరారు. పూరీలో పలు ప్రాజెక్టుల కోసం సేకరించిన సామాన్యులకు చెందిన భూమిని తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆందోళన ఉధృతం

శ్రీమందిరం నలువైపులా రాకపోకల కోసం 4 ద్వారాలు తెరవడం, రత్న భాండాగారంలో సొత్తు వివరాలను బహిరంగపరచాలనే డిమాండ్లతో ఆందోళన అంచెలంచెలుగా ఉధృతమవుతోంది. ఈ డిమాండ్లతో అక్టోబర్ 16న పూరీ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్ల సాధనకు శ్రీజగన్నాథ ఆలయం ప్రధాన పరిపాలనాధికారి సీఏవోకి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఆయన చర్యలు శూన్యం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా సంకీర్తన సత్యాగ్రహం ఆందోళనకు దిగినట్లు ఆందోళనకారులు వివరించారు. అయితే శ్రీమందిరం వారసత్వ ప్రాకార ప్రాజెక్టు నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో నలువైపుల ద్వారాల తలుపులు తెరవలేమని పూరీ జిల్లా యంత్రాంగం తేల్చి చెప్పింది.



కాంగ్రెస్ భవన్ ఆవరణలో జగన్నాథుని ప్రతిమకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గొడ్డలితో మహిళ హత్య

- పోలీసుస్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు



రక్తపు మడుగులో నందిని మృతదేహం



ఘటన స్థలం వద్ద దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని హటోమునిగుడలో మహిళను ఒక వ్యక్తి గొడ్డలితో నరికి హత్య చేసి, అనంతరం పోలీసుస్టేషన్‌లో లొంగిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. హటోమునిగుడ సమీపంలోని రామకృష్ణ మిషన్ స్కూల్‌లో గార్డెన్‌గా పనిచేస్తున్న నందిని నాయక్ (32) ఈ దారుణ హత్యకు గురయ్యింది. హత్య చేసిన వ్యక్తి అయిరా చంద్ర (36)గా పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందిని స్వగ్రామం గొడోగుడ. స్కూల్‌లో పనులు ముగించుకుని ప్రతిరోజూ హటోమునిగుడలోని తన స్నేహితురాలైన అయిరా చంద్ర భార్య ఇంట్లో తలదాచుకునేది. అయితే ప్రతిరోజూ ఒక పరాయి మహిళ తన ఇంట్లో పడుకోవడమేంటని తన భార్యను చంద్ర వారిస్తూ ఉండేవాడు. ఇకపై ఇంకెప్పుడు తన ఇంటికి రావొద్దని సదరు మహిళకు చెప్పాలని తన భార్యను హెచ్చరించాడు. అయితే ఇదేమీ పట్టించుకోని చంద్ర భార్య తన స్నేహితురాలికి చెప్పలేకపోయింది. దీంతో కోపగించుకున్న చంద్ర గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో నిద్రిస్తున్న నందినిని గొడ్డలితో మూడుసార్లు నరికి హత్య చేశాడు. అనంతరం మునిగుడ పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు. తన ఇంట్లో ఒక మహిళను హత్య చేశానని, తనను అరెస్టు చేయాలని పోలీసులకు చెప్పాడు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్డీపీవో సంతోషిణి ఒరం, పోలీసు సిబ్బంది మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కాళీ పూజలకు సర్వసిద్ధం



కొత్త బస్టాండ్‌లో తుది మెరుగులు దిద్దుకుంటున్న కాళీమాత విగ్రహం



ఆకట్టుకుంటున్న కాళీమాత సైకత శిల్పం

బరంపురం: నగరంలోని వివిధ కూడళ్లలో కాళీ పూజలకు సర్వం సిద్ధమవుతోంది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా దీపావళి నుంచి స్థానిక గేట్ బజార్, బెంగాలీ వీధి, చిన్నా బజార్, పెద్ద బజార్, కంటైన్‌మెంట్ రోడ్, బ్రహ్మనగర్, స్టేషన్ రోడ్, గుసానినువాగాంలో కాళీ పూజల మండపాలు రూపుదిద్దుకుంటున్నాయి. స్థానిక గేట్ బజార్‌లో 20 అడుగుల కాళీ విగ్రహం స్థాపనకు ప్రత్యేక పూజలతో పాటు చండీయాగం, చండీ పఠనం చేయనున్నట్లు పూజా కమిటీ ప్రతినిధులు తెలియజేస్తున్నారు. అలాగే స్థానిక భేజ్జిపూర్ నీలకంఠ నగర్ 3వ లైన్‌కి చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ దీపావళి సందర్భంగా స్థానిక భేజ్జిపూర్ మెయిన్ రోడ్‌లో తన కళా నైపుణ్యంతో ఇసుకతో రూపొందించిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయగడ: తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు, ఉద్యోగులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ భాస్కర రైతాకు వినతిపత్రం అందజేశారు. ఒడిశా ఒప్పంద ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గత 400 రోజులుగా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కేసరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుదర్శన్ పట్నాయక్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుదర్శన్ పట్నాయక్

భువనేశ్వర్: ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్‌కు శ్రీశ్రీ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వ విద్యాలయం 10వ స్నాతకోత్సవంలో సుదర్శన్ పట్నాయక్ పండిట్ రవిశంకర్ చేతుల మీదుగా ఈ గౌరవం పొందారు. సైకత కళ ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పించినందుకు 2014 సంవత్సరంలో భారతదేశ నాల్గో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీని కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకున్నారు. సాధారణ ప్రజానీకంలో అవగాహన పెంపొందించడం, ప్రముఖుల విజయ గాథలను సైకత కళాఖండాలతో అభినందించడం, ప్రధాన సమస్యలను ప్రజల దృష్టికి తీసుకొచ్చి చైతన్యపరచడం కోసం అనేక కళాఖండాలను ఆవిష్కరించి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాడు. ఆయన ఆవిష్కరించిన ప్రసిద్ధ శిల్పాలలో 100 శాంటా క్లాజ్‌ల ఉమ్మడి శిల్పంతో ప్రపంచ గిన్నిస్ రికార్డ్ సాధించాడు. 25 అడుగుల సువిశాల శాంటా క్లాజ్ ఆవిష్కరణతో లిమ్కా ప్రపంచ రికార్డు పుస్తకంలో స్థానం సొంతం చేసుకున్నారు.

'వృద్ధాప్య పింఛన్ పెంచాలి'



వినతిపత్రం అందజేసిన హరిరావు తదితరులు

జయపురం: రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ కింద ఇచ్చే డబ్బులను పెంచాలని సామాజిక కార్యకర్త బి.హరిరావు కోరారు. ఈ మేరకు సీఎం నవీన్ పట్నాయక్‌ను ఉద్దేశించి వినతిపత్రాన్ని జయపురం సబ్ కలెక్టర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రాల మాదిరిగా రాష్ట్రంలోనూ పింఛన్ సొమ్మును పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,750, అరుణాచల్ ప్రదేశ్‌లో రూ.2,000, ఛత్తీస్‌ఘడ్‌లో రూ.2,000, ఢిల్లీలో రూ.2,500, హరియాణాలో రూ.2,750, కేరళలో రూ.1,400, సిక్కింలో రూ.1,500, ఉత్తరాఖండ్‌లో రూ.1,500, పంజాబ్‌లో రూ.1,500లు ఇస్తుండగా, మన రాష్ట్రంలో కేవలం రూ.500లు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలు ఇస్తున్నట్లు ఒడిశా ప్రభుత్వం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ఉన్నతికి పనిచేస్తున్నామని విస్తృత ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, పెన్షన్లు పెంచేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, 5టీ కార్యదర్శి స్పందించి వృద్ధుల బాధలను తీర్చాలని కోరారు. వినతిపత్రం అందించినవారిలో వల్లభ ముదులి, జగన్నాథ్ హరిజన్, సనాధర హరిజన్, మధన పూజారి, బలరాం ముదిలి, రామభ్ యాఢి తదితరులు ఉన్నారు.

మహిళా కార్యకర్తల పాత్ర కీలకం



మహిళా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇందిరా నందో

జయపురం: రానున్న ఎన్నికల్లో మహిళా కార్యకర్తల పాత్ర కీలకమని జిల్లా మహిళా బీజేడీ నాయకురాలు డాక్టర్ ఇందిర నందో అన్నారు. స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో జయపురం మహిళా బీజేడీ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ఇప్పటినుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతీ వార్డులోనూ మహిళా కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం జరపాలని విజ్ఞప్తి చేశారు. మీరా పరిడ మాట్లాడుతూ.. ఎన్నికల్లో మహిళా కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. సమావేశంలో జిల్లా మహిళా బీజేడీ అధ్యక్షురాలు పార్వతీ మస్తి, కొరాపుట్ జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు తులసీ కిరసాని, జయపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, జిల్లా మహిళా బీజేడీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ బి.గాయిత్రీ దేవి, సబిత మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళా కార్యకర్తలు

ఆహార భద్రతలో...
తృణ ధాన్యాల పాత్ర కీలకం

- గిరిజనుల జీవనోపాధిపై దృష్టి
- సీఎం నవీన్ పట్నాయక్
- అంతర్జాతీయ తృణ ధాన్యాల సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్



ఆకట్టుకుంటున్న సదస్సు ప్రధాన ముఖ ద్వార తోరణం



సీఎం నవీన్ పట్నాయక్‌తో ఉత్తమ రైతులు

భువనేశ్వర్: రానున్న రోజుల్లో ఆహార భద్రతలో తృణ ధాన్యాల పాత్ర కీలకమని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. స్థానిక జనతా మైదానంలో రెండు రోజుల అంతర్జాతీయ తృణ ధాన్యాల (ఐసీఎం) 2023 సదస్సును గురువారం ప్రారంభించారు. తృణ ధాన్యాల వినియోగం వ్యాప్తి కోసం చేపట్టిన తొలి సదస్సు ఇదే కావడం విశేషం. కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. తృణ ధాన్యాల గ్లోబల్ రోడ్ మ్యాప్ రూపకల్పన లక్ష్యంగా ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తృణ ధాన్యాల మొక్కను నాటి 2 రోజుల అంతర్జాతీయ సదస్సుని లాంఛనంగా ప్రారంభించారు.

మిల్లెట్ మిషన్‌తో ముందడుగు

ఈ సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ.. గిరిజన వర్గాల జీవనోపాధి మరియు పోషణపై దృష్టి సారించి మిల్లెట్ మిషన్‌తో రాష్ట్రం ముందడుగు వేసిందన్నారు. ఈ ప్రయత్నం మరింత బలోపేతం చేసి ప్రజల ఆర్థికాభివృద్ధి, శ్రేయస్సు, ఆరోగ్యం పరిరక్షణతో బహుముఖాభివృద్ధికి దోహదపడేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. తృణ ధాన్యాల సాగుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు. దీంతో పోషకాహార ఉత్పాదనకు రాష్ట్రం శక్తి కేంద్రంగా వెలుగొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరం

ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అనుబంధ వాటాదారులతో కూడిన అంతర్జాతీయ సదస్సును నిర్వహించిన మొదటి రాష్ట్రం ఒడిశా కావడం గర్వకారణం. 2017 సంవత్సరంలో రాష్ట్రం మిల్లెట్స్ మిషన్ ప్రారంభించింది. ఈ కార్యక్రమం తృణ ధాన్యాల పునరుద్ధరణపై దృష్టి కేంద్రీకరించింది. మిల్లెట్ సాగు ప్రోత్సాహంలో భాగంగా రాగుల కొనుగోలుకు హామీ కార్యాచరణతో రైతులకు ఆదాయం మరియు జీవనోపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,500 కోట్లకు పైగా పెట్టుబడితో ముందుకు సాగుతోంది. అర్హులైన ప్రతీ రైతుని ఈ యాత్రలో భాగస్వామిగా మలిచేందుకు మిల్లెట్ మిషన్ నిరంతరం కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు. మిల్లెట్ మిషన్ లక్ష్య సాధనలో మహిళా స్వయం సహాయక బృందాల పాత్ర ప్రశంసనీయమన్నారు. మిల్లెట్ మిషన్ అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం పొందేందుకు గ్లోబల్ రోడ్డు మ్యాప్‌ను ఈ సదస్సులో ఆవిష్కరించాలన్నారు.

బహుమతుల ప్రదానం

అంతర్జాతీయ సదస్సు తొలిరోజు కార్యక్రమంలో సుందరగఢ్, కొరాపుట్, రాయగడ, నువాపడా జిల్లాలకు తృణ ధాన్యాల ఉత్తమ ఉత్పత్తి జిల్లాలుగా ముఖ్యమంత్రి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే తృణ ధాన్యాల ఉత్పత్తిలో అసాధారణ విజయం సాధించిన 5 మంది తృణ ధాన్యాల రైతులను సత్కరించారు. ఈ సందర్భంగా కాఫీ టేబుల్ బుక్ మరియు ప్రత్యేక పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ, రైతు సాధికారిత విభాగం మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 177 తృణ ధాన్యాల సాగు విజయవంతంగా సాగుతోందన్నారు. మిషన్ శక్తి మహిళలు తృణ ధాన్యాల సాగు మరియు ఉత్పాదనలో ముందంజలో ఉన్నారని తెలిపారు. మిల్లెట్ మిషన్ విజయం రాష్ట్రానికే పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణకు నోచుకుందని వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అన్నారు. తృణ ధాన్యాల సాగుకు ఐసీఏఆర్ అన్ని రకాల సహకారం అందిస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్ తెలిపారు. ఐసీఏఆర్ గత ఐదేళ్లలో 125 రకాల తొమ్మిది తృణ ధాన్యాలను అభివృద్ధి చేసిందన్నారు. ఒడిశాలోని గిరిజనుల ఆహార సంస్కృతిలో తృణ ధాన్యాలు అంతర్భాగమని, ఈ ధాన్యాల సాగును పెద్దఎత్తున చేపట్టేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ తెలిపారు. భారత్‌లోని ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) ప్రతినిధి తకయుకి హగివారా మాట్లాడుతూ భారతదేశం మరియు ఒడిశా మిల్లెట్లలో విజేతలుగా నిలిచాయని అభినందించారు. ఇది భారతదేశ వ్యవసాయ ముఖ చిత్రానికి కొత్త వన్నె దిద్దిందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ, రైతు సాధికారత ప్రిన్సిపల్ సెక్రటరీ అరబింద పాఢి, ఆహార ఉత్పాదనశాఖ డైరెక్టర్ ప్రేమ్ చంద్ర చౌదరి, అంతర్జాతీయ సంగీత స్వరకర్త, గ్రామీ అవార్డు విజేత రికీ కేజ్ మరియు ప్రముఖ చెఫ్ వికాష్ ఖన్నాలు కార్యక్రమంలో బ్రాండ్ అంబాసీడర్లుగా చేరారు.



సదస్సుకు హాజరైన జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు

రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు



వేదికపై ఎంపీ సురేష్ పూజారి తదితరులు

- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- ఎంపీ సురేష్ పూజారి

రాయగడ: రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యమని రాజ్యసభ ఎంపీ, బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సురేష్ పూజారి అన్నారు. స్థానిక సిరికొనలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కార్యకర్తల శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. దీని కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అమలు చేసే ప్రతీ పథకం ప్రజల వద్దకు చేరేలా సర్పంచ్‌లు, సమితి సభ్యులు కృషి చేయాలని సూచించారు. అధికార బీజేడీని భూస్థాపితం చేయాలంటే నిర్విరామంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

బీజేపీ రాయగడ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ.. రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిబిరంలో సోన్‌పూర్, బలంగీర్, నువాపడ, కలహండి, మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, నవరంగపూర్ జిల్లాల బీజేపీ నాయకులు పాల్గొన్నారన్నారు. వీరికి ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన వ్యూహాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. శిబిరంలో మాజీ ఎంపీ బలభద్ర మాఝి, బీజేపీ రాష్ట్రశాఖ సాధారణ కార్యదర్శి పూర్ణిమా కెర్‌కెటా, కార్యదర్శి రమేష్ సాహు, రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు రవి నాయక్, కార్యవర్గ సభ్యులు బసంత కుమార్ ఉలక, రాయగడ జిల్లా బీజేపీ సాధారణ కార్యదర్శి కిషోర్ పండ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరానికి హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

'మావో' డంప్ స్వాధీనం



డంప్ స్వాధీనం చేసుకున్న జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి టిమురిపల్లి పంచాయతీ తులసి పహడ్ అడవిలో జవాన్లను టార్గెట్ చేసి అమర్చిన మావో డంప్‌ను రెండో బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం నుంచి విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్న రెండో బెటాలియాన్ జవాన్లు అడవిలో ఒకచోట డంప్ గుర్తించారు. దీంతో అతి కష్టం మీద దీనిని వెలికి తీశారు. ఈ ప్రాంతం చత్తీష్‌ఘడ్‌కు ఆనుకొని ఉంది. డంప్‌లో ఒక యాంటీనా, బ్యాటరీ సెట్, కిట్లు, కవర్లు, మావో సాహిత్య పుస్తకాలు తదితర వస్తువులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మావోలు ఎన్ని ఎత్తులు వేసినా జవాన్లు తిప్పికొడతారని హెచ్చరించారు.



డంప్‌లో సామగ్రి

పట్టుబడిన సెల్‌ఫోన్ల దొంగ

జయపురం: బొరిగుమ్మ సమితి బిసింగపూర్ పోలీసులు సెల్‌ఫోన్లు దొంగతనాలు చేస్తున్న వ్యక్తి ఆటకట్టించారు. ఈ మేరకు బొరిగుమ్మ సబ్ డివిజన్ పోలీసు అధికారి సుభేందు కుమార్ శబర వివరాలు గురువారం వెల్లడించారు. ఆయన వివరణ ప్రకారం ఫిబ్రవరి 2వ తేదీన గుజునిగుడ గ్రామ పంచాయతీ బొడొపాయిగుడ గ్రామంలో ఒక పెళ్లి జరిగింది. అయితే అక్కడ ఒకేసారి 11 సెల్‌ఫోన్లు దొంగిలించబడ్డాయి. ఈ విషయంపై లాలేశ్వర గౌఢ అనే వ్యక్తి బిసింగపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తు అధికారి ఏఎస్ఐ శ్యామసుందర రథ్, కొరాపుట్ ఎస్పీ అభినవ సోన్‌కార్ ఆదేశం మేరకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. సైబర్ సెల్ సహకారంతో సెల్‌ఫోన్లు దొంగిలించిన ప్రధాన నిందితుడు రబీని గుర్తించారు. అతడిని చరాముల గ్రామంలో మొదట అరెస్టు చేశారు. పోలీసులు తమదైన రీతిలో విచారణ జరిపి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. అతడు దొంగిలించిన సెల్‌ఫోన్లు అమ్మిన విషయం వెల్లడించి, వాటిని కొన్నవారి వివరాలు పోలీసులకు తెలియజేశాడు. దీంతో దొంగిలించబడిన సెల్‌ఫోన్లు కొన్న 7 గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో బిసింగపూర్ పోలీసు అధికారి సంభిత్ కుమార్ స్వైయ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో సుభేందు కుమార్ శబర తదితరులు

ఫారెస్టర్‌పై అడవి పంది దాడి




చికిత్స పొందుతున్న ఫారెస్టర్ గుండియా



వలలో అడవి పందిని బంధించిన దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల అటవీ శాఖ ఫారెస్టర్ మోహన్ గుండియా చేతివేలును అడవి పంది కొరికింది. వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఉదయం బలిమెల మినీ స్టేడియంలో మార్నింగ్ వాక్‌కు వచ్చినవారికి అక్కడ అడవి పంది కనిపించింది. అడవి పంది స్టేడియంకు ఆనుకొని ఉన్న పోటేర్ వాటర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ ఇంటి ఆవరణలోకి ప్రవేశించింది. దీంతో వెంటనే బలిమెల అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఫారెస్టు సిబ్బంది వచ్చి అతి కష్టం మీద అడవి పందిని పట్టుకున్నారు. అయితే ఈ సమయంలో వలలో చిక్కుకున్న అడవి పంది ఒక్కసారిగా ఫారెస్టర్ మోహన్‌పై దాడిచేసి చేతివేలిని కొరికింది. ఆయనను వెంటనే ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

రోజంతా కరెంట్ కోత



రాజవీధిలో మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కరెంటు కోత విధించారు. దీంతో అనేక మంది ఆన్‌లైన్ ఈ–సేవా కేంద్రాలు, బ్యాంకులు, వ్యాపారులు అవస్థలు పడ్డారు. 132/33 గ్రిడ్‌లో వార్షిక మెయింటెనెన్స్‌లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు టాటా పవర్ సిబ్బంది చేపట్టడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి



భర్త మృతదేహం వద్ద రోధిస్తున్న బసంతి

మల్కన్‌గిరి: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ టెక్నీషియన్ నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. కలిమెల సమితి ఎంవీ 72 గ్రామానికి చెందిన తపాస్ రోయి (55) కిడ్నీవ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనను ఇదివరకు బరంపూర్ తీసుకొని వెళ్లి అక్కడ నాలుగు సార్లు డయాలసిస్ చేయించారు. అయితే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సైతం డయాలసిస్ చేస్తుండడంతో ఇక్కడ అడ్మిట్ చేశారు. కానీ డయాలసిస్ ఒకటి తర్వాత మరొకటి చేయాలంటే డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో తపాస్ భార్య బసంతి ఫోన్‌పే ద్వారా రూ.5 వేలను టెక్నీషియన్‌కు పంపించింది. అయితే ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని టెక్నీషియన్ అనడంతో సరే అంది. కానీ గురువారం చేయాల్సిన డయాలసిస్ ఎంత చెప్పినా చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో తపాస్ మృత్యువాతపడ్డాడు.

భర్త మరణంతో టెక్నీషియన్‌పై వైద్యాధికారులకు ఫిర్యాదు చేసింది. తన భర్త చావుకు టెక్నీషియన్ కారణమని, ఉచితంగా చేయాల్సిన డయాలసిస్‌కు డబ్బులు తీసుకొని ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించింది. దీనిపై వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందో స్పందించి ఆరోపణలు రుజువైతే టెక్నీషియన్‌పై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

పేపర్ మిల్లులో ఉత్పాదకత ప్రారంభం

- 5 నెలల తర్వాత ఉత్పత్తి
- సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యం అంగీకారం



ఉత్పత్తికి శ్రీకారం చుట్టిన పేపరు మిల్లు

జయపురం: గత జూన్ నుంచి ముడి సరుకు కొరత కారణంగా చూపుతూ జయపురం ప్రాంతంలోని గగణాపూర్‌లో గల సేవా పేపరు మిల్లులో ఉత్పాదకత నిలిచిన విషయం తెలిసిందే. సుమారు 5 నెలలుగా మిల్లులో ఉత్పత్తి ప్రారంభించాలని, జీతాలు చెల్లించాలని నాలుగు కార్మిక యూనియన్లు డిమాండ్ చేయడమే కాకుండా ఆందోళనలు జరిపాయి. దీనిలో భాగంగా జిల్లా లేబర్ అధికారులు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక నాయకులతో పలు సమావేశాలు నిర్వహించినా సమస్య కొలిక్కి రాలేదు. అయితే ఈనెల 7వ తేదీన జరిగిన త్రైపాక్షిక సమావేశంలో సమస్య పరిష్కారమై మిల్లులో తిరిగి పేపర్ ఉత్పాదకత ప్రారంభమైంది. ఉద్యోగులకు జీతాలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు మిల్లు యాజమాన్యం హామీ ఇచ్చింది. జూన్ నెల జీతాలలో మదర్ ఆర్థ్ రిసోర్సెస్ మిల్లు హస్తగతం చేసుకోక ముందు బకాయిల్లో 50 శాతం చెల్లించేందుకు యాజమాన్యం ముందుకొచ్చింది. జూలై జీతాలు నవంబర్ నెలాఖరులోగా చెల్లించేందుకు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చింది. మిగతా సమస్యలపై 6 నెలల తర్వాత చర్చించేందుకు నిర్ణయించారు. మిల్లులో ఉత్పత్తికి తాము పూర్తిగా సహకరిస్తామని యూనియన్లు హామీ ఇచ్చాయి. మిల్లు ఆవరణలో జరిగిన సమావేశంలో లేబర్ కమిషనర్ నరేంద్ర రాయిక, జిల్లా లేబర్ అధికారి బృందావన సెట్టి, పేపరు మిల్లు చీఫ్ ఎం.కె.గుప్త, పేపరు మిల్లు యూనిట్ హెడ్ ఎస్.ఎస్.పాల్, మానవ వనరుల అధికారి రమేష్ యాదవ్, శ్రామిక సంఘాల నాయకులు ఎం.సత్యనారాయణ, ధీరేంద్ర మహంతి, తారా ప్రసాద్ ప్రధాన్, వంశీధర్ మహంకుడొ, సరోజఖ కుమార్ సుహార్, ప్రసాద్ పంజియ, బనమాలి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కబడ్డీ పోటీలకు జేఎన్‌టీయూ జట్టు



ఎంపికైన క్రీడాకారులతో వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: కాకినాడలో గురువారం నుంచి జరుగుతున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) జట్టు సభ్యుల పేర్లను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె వెంకటసుబ్బయ్య గురువారం విడుదల చేశారు. విజ్ఞాన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫార్మేషన్ కళాశాల దువ్వాడలో ఇటీవల జరిగిన అంతర యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు ప్రతిభ చూపడంతో జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. జట్టుకు ఎంపికైన వారిలో కె.లోకేష్, ఆర్.విష్ణువర్ధన్, ఎం.శ్రీనివాసులు, ఈ.గుణసాయి, కిషోర్ (విజ్ఞాన కాలేజీ), కె.అశోక్, ఎ.శివమణికంఠ, ఎస్.రామ్‌చరణ్ (రఘు కాలేజీ), డి.రవి (అవంతి కాలేజీ), బి.విజయ్ (ఎస్ఎస్ఆర్ఐటీ), టి.సూర్యవివేక్ (జేఎన్‌టీయూ జీవీ), కె.తేజ (డైట్ కాలేజీ) ఉన్నారు.

వ్యక్తికి నాలుగేళ్ల జైలు

బొబ్బిలి: పట్టణంలోని వెలమ వీధికి చెందిన విక్రమ్ ఏసు స్థానికంగా ఉన్న ఓ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో అప్పటి ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి అక్టోబర్19, 2019న కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి, నాలుగేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. పీపీ శంకరరావు వాదనలు వినిపించారు. సాక్షులను హెచ్‌సీ స్వామినాయుడు ప్రవేశ పెట్టారని బొబ్బిలి పోలీసులు తెలిపారు.

మందుగుండు అక్రమ సామగ్రి స్వాధీనం

బాడంగి: మండల కేంద్రంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన దీపావళి మందుగుండు సామగ్రిని స్థానిక పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ఉల్లి సత్తిబాబు ఇంటి వద్ద నిల్వ చేసిన సుమారు రూ.81వేల విలువ గల 60 రకాల మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులకు అందిన సమాచారం మేరకు తెర్లాం ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ కొండలరావు, సిబ్బంది దాడి చేసి సామగ్రిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు బాధ్యులైన పూసర్ల వెంకట సత్యనారాయణ, ఏటూరి గణేష్, ఉన్న నగేష్‌లను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్టు చెప్పారు. ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలువురికి గాయాలు

విజయనగరం క్రైమ్: స్థానిక పూల్‌బాగ్ ఫారెస్ట్ కార్యాలయం సమీపంలో బొలెరో, పల్సర్ బైక్, ఆటో ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈ మేరకు గురువారం రాత్రి టూటౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి నెల్లిమర్ల వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఆటోను క్రాస్ చేయబోయి ఎదురుగా వస్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొంది. ఆటో తిరగబడింది. ఆటోలో ఉన్న వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. బైక్‌పై వచ్చిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగు అంబులెన్స్‌లు సంఘటనా స్థలానికి వచ్చాయి. క్షతగాత్రులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ షేక్ శంకర్ పేర్కొన్నారు.

కొండగూడేంలో భారీ దొంగతనం

సంతకవిటి: మండల పరిధిలోని కొండగూడేం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కెంబూరు సూర్యారావు ఇంట్లో బుధవారం రాత్రి భారీ దొంగతనం జరిగినట్టు ఎస్ఐ బి.లోకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. సూర్యారావు కుటుంబం బుధవారం సాయంత్రం అయ్యవారిపేటలో బంధువుల నూతన గృహ ప్రవేశానికి వెళ్లారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి చేరుకునేసరికి కిటికీ పగలుగొట్టి ఉండడంతో, దొంగతనం జరిగిందని బాధితులు ఫోన్ చేయడంతో గ్రామానికి సిబ్బందితో చేరుకున్నామని, రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించిన దొంగలు కిటికీ అద్దం పగలుకొట్టి, గ్రిల్స్‌ను తొలగించి ఇంట్లోకి చొరబడ్డారన్నారు. బెడ్‌రూం డోర్ తాళాలు కూడా పగలుగొట్టి, లోపల ఉన్న బీరువాను తెరచి అందులో ఉన్న ఆరుంపావు తులాల బంగారం, 30తులాల వెండి, కొంత నగదును దోచుకెళ్లారని వెల్లడించారు. రాజాం సీఐ ఎస్.శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో గల సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి టీవీఎస్ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డిపో మేనేజర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. సమస్యలపై 99592 25621 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

అధికారిక 'దత్తత' సేఫ్

పిల్లలను చట్ట ప్రకారం మాత్రమే దత్తత తీసుకోవాలి. దీని వల్ల దత్తత వెళ్లిన పిల్లలకు పూర్తి హక్కులు లభిస్తాయి. ఏదైనా సమస్య వస్తే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించవచ్చు.

- అనధికారిక దత్తత చట్టరీత్యా నేరం
- జిల్లాలో నెల రోజులు పాటు జాతీయ దత్తత మాసోత్సవాలు
- ఇప్పటి వరకు 50 మంది పిల్లలు దత్తత
- వీరిలో ముగ్గురు విదేశాలకు దత్తత



దత్తత ప్రొసెడింగ్ పత్రాన్ని తల్లిదండ్రులకు అందజేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు

విజయనగరం ఫోర్ట్: అనధికారిక దత్తత చట్ట రీత్యా నేరమని చెప్పినా కొందరు ఇంకా ఆ పద్ధతిలోనే దత్తత తీసుకుంటున్నారు. ఇటువంటి దత్తత వల్ల పిల్లలకు భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు. ఈ నేపథ్యంలో దత్తతపై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు దత్తత మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. నవంబర్ 1 నుంచి 30 వరకు ఈ మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. దత్తత ఏ విధంగా పొందాలి. దత్తత తీసుకోవడానికి ఉండాల్సిన అర్హతలు గురించి ప్రజలకు విస్తత అవగాహన కల్పించనున్నారు. జాతీయ దత్తత మాసోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించనున్నారు.

నెల రోజుల కార్యక్రమాలు ఇలా...

దత్తతపై పోస్టర్లు ముద్రించి వాటి ద్వారా అవగాహన కల్పించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, పీహెచ్‌సీల వద్ద దత్తత గురించి అవగాహ న సదస్సులు నిర్వహించి అవగాహన కలిపిస్తారు. అదే విధంగా స్వచ్ఛంద సంస్థలతో సమన్వయ స మావేశాలు నిర్వహించి దత్తత గురించి చెబుతారు. బాలసదన్‌లు, చిల్డ్రన్‌హోంల్లో ఉన్న ఆరు నుంచి 18 ఏళ్లలోపు అనాథ పిల్లలను దత్తత వెళ్లాలని కౌన్సెలింగ్ ఇస్తారు. నవంబర్ 14 నుంచి జరిగే జాతీయ బాలల వారోత్సవాల్లో కూడా అధికారికంగా దత్తత తీసుకోవడంపై అవగాహన కల్పిస్తారు.

50 మంది దత్తత

2011లో అనాథ శిశువుల సంరక్షణ కోసం జిల్లాలో శిశుగృహను ఏర్పాటు చేసారు. ఇక్కడ సంరక్షించబడే పిల్లలు అంతా ఆరేళ్లలోపు వారే. ఇక్కడ సంరక్షించబడిన వారిలో ఇప్పటి వరకు 50 మందిని పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చారు. వీరిలో ముగ్గురు పిల్లలను విదేశాలకు, 47 మందిని మన దేశంలో పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చారు.



వన్ స్టాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఊయల

అనధికార దత్తత చెల్లదు

కొందరు ఇప్పటికీ బంధువులకు చెందిన పిల్లలను, తెలిసిన వారి పిల్లలను అనధికారికంగా దత్తత తీసుకుంటున్నారు. ఇలా అనధికార దత్తత చెల్లదు. ఎటువంటి హక్కులు పొందలేరు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు తర్వాత పిల్లలు పుడితే వీరిని నిర్లక్ష్యం చేస్తే న్యాయ పోరాటం చేయడానికి అవకాశం ఉండదు. అధికారిక దత్తత ఇచ్చినప్పుడే పిల్లలు పుట్టే అవకాశం లేదని వైద్యుని దగ్గర నుంచి సర్టిఫికెట్ తీసుకున్న తర్వాతే దత్తత ఇస్తారు. దీని వల్ల వారికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు. చట్ట పరంగా దత్తత ఇస్తారు కాబట్టి ఏ సమస్య వచ్చినా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. అనధికార దత్తత తీసుకున్న వారికి జేజే యాక్ట్ సెక్షన్ 81 ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

ఆస్పత్రుల వద్ద ఊయలలు

ఎవరైనా తమకు పిల్లలు అక్కర్లేదుకుంటే చెత్తకుండీలు, రోడ్డు పక్కన తుప్పల్లో పడేస్తుంటారు. ఆ విధంగా పడేయడంతో శిశువులు మరణిస్తున్నారు. పిల్లలు అక్కర్లేదుకునేవారు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ఊయలలో వేస్తే వారిని సంరక్షించి అధికారికంగా దత్తత ఇస్తారు. ఇందు కోసం ఘోషా స్పత్రి, వన్ స్టాప్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఊయలలను ఏర్పాటు చేసారు.

నెల రోజులు సదస్సులు, సమావేశాలు



పిల్లలను అధికారికంగా దత్తత తీసుకోవడంపై నెల రోజుల పాటు సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నాం. అనధికారికంగా దత్తత తీసుకోవడం చట్ట రీత్యా నేరం. ఎవరైనా తీసుకుంటే అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. చట్ట ప్రకారం దత్తత తీసుకోవడం మంచిది.

– బి.శాంతకుమారి,
జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

దత్తతకు కావాల్సిన ధ్రువపత్రాలు

పిల్లలు దత్తత కావాలంటే ముందుగా పాన్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. బిడ్డను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు తమ పాన్ కార్డుతో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. కారా. ఎన్ఐసి. ఇన్ వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఎకనాలెడ్జ్ మెంట్ ప్రింట్ తీసుకోవాలి. ఫ్యామిలీ ఫొటో (మ్యాక్సీ సైజు), ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, పాస్ పోర్టు, కరెంటు బిల్లులో ఏదో ఒక నివాస ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఏడాదికి రూ.2 లక్షలకు తగ్గకుండా) తహసీల్దార్ నుంచి తీసుకున్న సర్టిఫికెట్, ఉద్యోగులు అయితే శాలరీ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రులిద్దరివీ పుట్టిన ధ్రువీకరణ పత్రాలు, నోటరీ నుంచి పుట్టిన తేదీ అఫిడవిట్, తల్లిదండ్రులు ఇద్దరివి హెచ్ఐవీ, వీడీఆర్, హెపటైటీస్ బీ, టీబీ(స్పూటమ్), ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలి.

ఆత్మ రక్షణకు కరాటే దోహదం : జేసీ

- జోగింపేటలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న జేసీ గోవిందరావు, చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

సీతానగరం: కరాటే విద్య ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యానికి కూడా దోహదపడుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభ విద్యాలయంలో 67వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను గురువారం ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, డీఈఓ ప్రేమకుమార్‌తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్రంలో 13 జిల్లాలకు చెందిన 600 మంది కరాటే పోటీల్లో పాల్గొనేందుకు మన్యం జిల్లా జోగింపేటకు రావడం అభినందనీయమన్నారు. క్రీడలో ఓటమి సహజమని, ఓటమితోనే విజయానికి మెట్లు నిర్మించాలన్నారు. ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ కరాటే వ్యాయామ విద్యనభ్యసించే వ్యక్తి ఆత్మ రక్షణకు, పలువురి రక్షణకు ఉపయోగపడుతుందని, వ్యాయామ క్రీడాకారులకు ప్రభుత్వ కొలువుల్లో నియామకాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న క్రీడల్లో పాఠశాలలతో పాటు తల్లిదండ్రులు కీర్తిప్రతిష్ఠలు సంపాదించిపెట్టాలని కోరారు. డీఈఓ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులు అండర్ 14, 17, 19 బాలురు, బాలికలకు సంబంధించి జరగనున్న పోటీల్లో 600 మంది పాల్గొననున్నట్టు తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాలైన వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సింహాచలం, ఎంఈఓ సూరిదేముడు, ఎంపీరమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



13 జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థినులు

చీపురుపల్లి: జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలకు పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలకు చెందిన కె.ఆదిలక్ష్మి, నిఖితాకుమారి సింగ్‌లను గురువారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా.పివి.కృష్ణాజీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ కాలేజ్ కమ్ యూనిర్సిటీ స్థాయి ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన ఆదిలక్ష్మి, నిఖితాకుమారి సింగ్‌లు ఎంపికైనట్లు చెప్పారు. అక్కడ జరిగిన ఎంపికల్లో స్థానిక కళాశాలలో తృతీయ సంవత్సరం బీఏ చదువుతున్న కె.ఆదిలక్ష్మి 59 కేజీల విభాగంలోను, ప్రథమ సంవత్సరం బీఏ చదువుతున్న నిఖితాకుమారి సింగ్ 57 కేజీలు విభాగంలోనూ ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.జ్వాలాముఖి, ఆర్ట్స్ విభాగం అధిపతి డా.బి.గోవిందరావు తదితరులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిశోధనలు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: పరిశోధనలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో పరిశోధన అనే అంశంపై గురువారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. పరిశోధనలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పరిశోధనలు ఏ విధంగా చేయాలి, జర్నల్స్ ఏ విధంగా పబ్లిష్ చేయాలి వంటి వాటిపై వివరించారు. సమాజంలో కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్న సందర్భాల్లో వాటిని అరికట్టేందుకు అవసరమైన వాటిపై పరిశోధనలు జరగాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని, ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌బాబు, ఫామకాలజీ హెచ్ఓడీ డాక్టర్ అన్నపూర్ణ, మైలాన్ జనరల్ మేనేజర్ విజయభూషణం , మిమ్స్ వైద్య కళాశాల ఎనస్తీషియా విభాగం వైద్యులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

సాలూరు: మండలంలో పీఎన్ బొడ్డవలస అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జనార్దన్‌సాయి డిసెంబర్‌లో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీరాములు గురువారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 వరకు ఒంగోలు, ప్రకాశం జిల్లాల్లో జరిగిన అండర్ 17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జట్టు తృతీయ స్థానంలో నిలవగా, జట్టులో ఉన్న జనార్దన్‌సాయి ప్రతిభ కనబర్చాడని తెలిపారు. జనార్దన్‌సాయిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు అధికారులు ప్రకటించారని పేర్కొన్నారు. విద్యార్థిని పీడీ విద్యాసాగర్, పీఈటీ నాయుడు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు లిఖిత్

విజయనగరం: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు నగరానికి చెందిన ఆర్.లిఖిత్ అర్హత సాధించాడు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన అండర్ – 19 బాల, బాలికల స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్.లిఖిత్ ఆ పోటీల్లో కాంస్య పతకం దక్కించుకోవటంతో పాటు ఈ నెల 20వ తేదీ నుంచి జమ్ముకశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు అర్హత సాధించటం విశేషం. ప్రస్తుతం నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న లిఖిత్ ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. తాజాగా అండర్ – 19 స్కూల్ గేమ్స్ జాతీయ పోటీల్లో సత్తా చాటాలని కోచ్ డివి.చారిప్రసాద్ ఆకాంక్షించారు.



కోచ్‌తో జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన లిఖిత్

ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: ఎన్నికలు సమీపిస్తుండడంతో కొన్ని దుష్టశక్తులు, ప్రతిపక్షాలు, కొన్ని మీడియా చానల్స్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు 'జయహో జగనన్న' నినాదంతో జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న సంకల్పంతో చేపట్టిన తిరుమల పాదయాత్రకు ఎల్.కోట సమీపంలో గురువారం సంఘీభావం తెలిపారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు చేస్తున్న మేలును చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. డిసెంబర్ 21 జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు నాటికి తిరుమల శ్రీవారి పాదాల చెంతకు రఘురాజు క్షేమంగా చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రఘురాజుతోపాటు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, ఎల్.కోట, వేపాడ, ఎస్.కోట ఎంపీపీలు, పార్టీ మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పేదలకు - పెత్తందార్లకు మధ్యే పోటీ

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బాడంగి: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో పేదలకు - పెత్తందార్లకు మధ్యే పోటీ అని ప్రజలు ఏ ప్రభుత్వం కావాలో తేల్చుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ముగడ గ్రామంలో సుమారు రూ.90 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లతో పాటు సచివాలయం, రైతుభరోసా, విలేజ్ క్లినిక్ భవనాలను గురువారం ప్రారంభించారు. వీటి నిర్మాణాలను చేపట్టిన ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు యామల శివప్రసాద్‌ను అభినందించారు. ముందుగా సచివాలయం ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన గాంధీజీ, వైఎస్సార్ విగ్రహాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ న్యాయం చేస్తున్నారని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా చేసుకోవాలన్నారు. టీడీపీ మాయమాటలు నమ్మొద్దన్నారు. ముగడలో జగనన్న ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.20 కోట్ల వరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. గ్రామంలో మధ్యలో నిలిచిపోయిన డ్వాక్రా భవనానికి నిధులు కేటాయిస్తానన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగన్‌తోనే సాధ్యపడిందన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమయ్యాయన్నారు. నాలుగున్నరేళ్లలో కరువు లేకున్నా ఈ ఏడాది చివరలో కాస్తంత కరువు ఏర్పడినట్టు గుర్తించి ఈ సీజన్‌లోనే నష్ట పరిహారం వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. బీమా కూడా వర్తింపజేస్తామన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండగలా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సమావేశంలో బొబ్బిలి, బాడంగి మండల పార్టీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, బొమ్మినాయుని వెంకటనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధు, పీఆర్ డీఈఈ అప్పారావు, ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ అజురఫీజాన్, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


కమ్యూనిటీ పారా మెడికల్ సిబ్బంది నూతన కార్యవర్గం



ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గం

పార్వతీపురం టౌన్: కమ్యూనిటీ పారా మెడికల్ - ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో జరిగింది. ఎన్నికను రాష్ట్ర అధ్యక్షుడు టి.ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు సమక్షంలో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నాగిరెడ్డి సింహాచలం ఉపాధ్యక్షుడిగా వానపల్లి శంకరరావు, కార్యదర్శిగా నడిమింటి గోపాలనాయుడు, సహాయ కార్యదర్శిగా బి.వి.రమణ, కోశాధికారిగా తులసీదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారికి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, వివిధ మండలాల సభ్యులు అభినందించారు. అనంతరం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు హెల్త్ కేర్ ప్రొవైడర్స్ నిర్వహించవలసిన విధి విధానాలను తెలియజేశారు.

గిరిజనుడి హత్య!



మృతి చెందిన గిరిజనుడు అర్జున్

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ అడ్డతీగ గ్రామం వద్ద గురువారం సాయంత్రం గిరిజన యువకుడు హత్యకు గురైనట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటనపై స్థానిక పోలీసులు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. మృతుని భార్య ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం గుమ్మ గ్రామానికి చెందిన పాంగి అర్జున్(38) మండలంలోని కొత్తఅడ్డతీగ గ్రామంలో భార్యాబిడ్డలతో నివసిస్తున్నాడు. గత కొంత కాలంగా గ్రామానికి దగ్గరలో ఉన్న అనాథాశ్రమంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం 6గంటల సమయంలో గ్రామానికి సమీపంలో అర్జున్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో గుండెలపై రెండుచోట్ల లోతైన గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తొలుత గుర్తించి అర్జున్ భార్య కాంతానికి సమాచారం ఇచ్చాడు. ఆమె పరుగున వెళ్లి భర్తతో మాట్లాడగా అడ్డతీగ వాళ్లు కొట్టారని చెబుతుండగా ఆయన మాట ఆగిపోయింది. భార్య వెంటనే గ్రామంలోకి వచ్చి చెప్పగా 108లో ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అర్జున్ మృతి చెందినట్టు వైద్యులు చెప్పడంతో భార్య కన్నీరుమున్నీరవుతోంది. అరుజ్న్ భార్య ఐదు నెలలు గర్భిణి కాగా, ఏడాది వయస్సున్న కుమార్తె ఉంది. అర్జున్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

నేటి నుంచి బాణసంచా విక్రయాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో బాణాసంచా విక్రయాలు జరిపేందుకు తాత్కాలిక షాపులకు నేటి నుంచి మూడు రోజుల వరకు అనుమతులు ఇవ్వనున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పది ఫైర్ స్టేషన్ల పరిధిలో ఉన్న 91 తాత్కాలిక షాపులకు (శ్రీకాకుళం-48, రణస్థలం -12, నరసన్నపేట-07, కోటబొమ్మాళి -5, టెక్కలి -1, పలాస -9, సోంపేట- నిల్, ఇచ్ఛాపురం-1, కొత్తూరు -2, ఆమదాలవలస-0) ఆర్డీ వో ద్వారా నిరభ్యంతర పత్రం మంజూరు చేశామని, ఇంకా పెట్టుకోదల్చుకుంటే ఈ నెల 12 వరకు అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో స్టాల్స్ ఉన్నందున అగ్నిమాపక శకటాన్ని మూడు రోజుల పాటు ఉంచనున్నట్లు చెప్పారు.

పొలాల్లో పులి జాడలు



మాలపేట గెడ్డ వద్ద పంట పొలాల్లో పెద్ద పులి అడుగులు

టెక్కలి: కంచిలి, పలాస, నందిగాం మండలాల్లో సంచరించిన పెద్దపులి జాడలు ఇప్పుడు టెక్కలి మండలంలో కనిపిస్తున్నాయి. టెక్కలి మండలం గూడేం సమీపంలో గల ఆంధ్రా-ఒడిశా రోడ్డులో మాలపేట గెడ్డకు ఆనుకుని పొలం గట్లపై పెద్దపులి అడుగు జాడలను అధికారులు గుర్తించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గూడేం గ్రామానికి చెందిన తిప్పాన రా మయ్య గురువారం ఉదయాన్నే తన పంట పొలా న్ని చూసేందుకు వెళ్లగా, పొలం గట్లపై పెద్ద పెద్ద అడుగులను చూసి భయాందోళనకు గురయ్యారు. దీంతో తన సోదరులు ఆదినారాయణ, నారాయణరావుకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు అట వీ శాఖాధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఫారెస్ట్ రేంజర్ సంజీవ్ నేతృత్వంలో సెక్షన్ అధికారులు రజనీకాంత్, శ్రీనివాసరావు, రామకృష్ణ, యశస్వి, ఉమామహేశ్వరావు, ఎన్‌జీఓ సిబ్బంది అమర్ తదితరులు గూడేం గ్రామానికి చెందిన రైతులు గుర్తించిన ఆనవాలను పరిశీలించి అవి పెద్ద పులి అడుగులుగా నిర్ధారించారు. పులి పాద ముద్రలను గమనిస్తూ కొంత దూరం వరకు పరిశీలన చేశారు. అనంతరం అటవీశాఖాధికారులు మాట్లాడుతూ.. గూడేం గ్రామానికి ఆనుకుని పంట పొలాల మీదుగా సమీపంలో గల కొండల పైకి పులి చేరుకున్నట్లు అంచనా వేశారు. గూడేం గ్రామం పరిసర గిరిజన గ్రామాలతో పాటు ఆంధ్రా-ఒడిషా రోడ్డు పై రాకపోకలు సాగించే వారంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా పులి ఉన్నట్లు గుర్తిస్తే తక్షణమే తమకు సమాచారం అందజేయాలన్నారు. ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే చీకటి పడిన తర్వాత ఆరు బయట సంచరించవద్దని సూచించారు. పశువులను ఆరుబయట కాకుండా భద్రంగా కట్టాలని సూచించారు. ఎక్కడైనా పులి ఉన్నట్లు అనుమానం వస్తే.. తక్షణమే 6302267557, 9441439721 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రంగోయి గ్రామం పరిశీలన

కాశీబుగ్గ: పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ రంగోయి గ్రామాన్ని పలాస రెవిన్యూ డివిజనల్ అధికారి భరత్‌నాయక్ గురువారం సందర్శించారు. ఈ నెల 23వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలాసలో కిడ్నీ ఆస్పత్రి, డాక్టర్ వైఎస్సార్ సుజలధార పథకాన్ని ప్రారంభించనున్నారు. పథకాల పరిశీలనలో భాగంగా పలాస మండలంలో ఉన్న రామకృష్ణాపురం, రంగోయి గ్రామాలను ప్రతిపాదించడంతో వాటిని పరిశీలించి అక్కడి పరిస్థితులు ఫొటోలో చిత్రీకరించి ఉన్నత అధికారులకు పంపించారు. ఆయనతో పాటు పలాస తహసీల్దార్ లంబాల మధుసూదనరావు తదితరులు ఉన్నారు.